ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 21 జూలై 2025







ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఉత్సాహంగా కావడి ఉత్సవం

పిడుగురాళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగులగుడి దేవాలయంలో ఆడికృతిక మహోత్సవాన్ని ఆదివారం భక్తులు అట్టహాసంగా నిర్వహించారు. శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, మహాగణపతి పూజ, విశేష అభిషేకాలు నిర్వహించి పట్టణంలో కావడి ఉత్సవం, మేడ్ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు, మహిళలు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు గుడె నాగసతీష్, అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వరశర్మ, కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆషాఢమాస ఆదివారాన్ని పురస్కరించుకుని శ్రీకనకదుర్గ అమ్మవారికి మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మతల్లి దేవాలయంలోనూ ఆషాఢమాస బోనాలు సమర్పిం చేందుకు భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పిడుగురాళ్లలో కావడి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆగని గ్రానైట్ దందా

జీరో బిల్లులతో అక్రమ రవాణా

- నాడు ఆందోళనలు.. నేడు నేతల అండ
- గత ప్రభుత్వ తరహాలోనే అడ్డగోలు దోపిడీ
- వాటాల్లో తేడాలు.. ఆధిపత్య పోరుతోనే లారీల పట్టివేత

(బాపట్ల, మార్టూరు, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో యథేచ్ఛగా గ్రానైట్ దందా సాగింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ దందాపై ఎడతెగని పోరాటమే చేసింది. ప్రభుత్వం మారి అధికారం టీడీపీకి చేతి కొచ్చింది. కానీ ఈ గ్రానైట్ దందాలో మాత్రం మార్పు రాలేదు. పైగా ఇది మరో స్థాయికి చేరుకుంది. అప్పుడు పెడబొబ్బలు పెట్టిన నేతల అనుయాయులే ఇప్పుడు సూత్రధారులయ్యారు. ప్రైవేట్ సైన్యం కూడా సేమ్ టూ సేమ్. గ్రానైట్‌ను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా ఎంత సంపాదించవచ్చో అప్పటి నేతలు దారి చూపగా, దానిని అందిపుచ్చుకున్న ప్రస్తుత నేతలు ఇప్పుడూ అదేమార్గంలో దూసుకెళుతున్నారు. మైనింగ్, రెవెన్యూతో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పాత్ర ఈ అడ్డగోలు దందాలో ఉండగా, కీలకపాత్ర మాత్రం అధికార పార్టీ నేతల అనుచరులదే అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బాపట్ల జిల్లాలోని మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల నుంచి గ్రానైట్ పలకలతో పాటు ముడిసరుకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. బాపట్ల జిల్లా నుంచి పల్నాడు జిల్లా మీదగా తెలంగాణలోకి ప్రవేశించాల్సి ఉంది. ఈ క్రమంలో మైనింగ్ సీనరేజ్‌కు సంబంధించి ఓ ప్రైవేటు ఏజెన్సీ (మిగతా 7వ పేజీలో)



నరసరావుపేట బైపాస్ రోడ్డుపై గోతులు

భయపాస్..!

- గోతుల మయంగా నరసరావుపేట బైపాస్
- ప్రాణ సంకటంగా ప్రయాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట బైపాస్‌లో ప్రయాణం భయం భయంగా సాగుతోంది. సంక్రాంతి కల్లా రహదారులపై గోతులు కనిపించకుండా చేస్తామన్న ప్రభుత్వం.. నరసరావుపేటను విస్మరించింది. ఏడాది గడిచినా నరసరావుపేట రహదారిలో గోతులకు తట్ట మట్టి కూడా పోయలేదు. నిధుల లేమి కారణంతో రహదారిని అధ్వానంగా వదిలేశారు. దీంతో ఈ రహదారిలో ప్రయాణం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. గుంటూరు రోడ్డు నుంచి సత్తెనపల్లి రోడ్డు వరకు ఉన్న ఈ రహదారి వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. గోతుల వల్ల వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఉద్యమించారు. అధికారంలోకి వచ్చాక రోడ్డు వైపు కన్నెత్తి చూడటం లేదు. పోలీసు శాఖ గుంటూరు రోడ్డు, సత్తెనపల్లి రహదారుల నుంచి వచ్చే వాహనాలను పట్టణంలోకి రానివ్వకుండా బైపాస్‌కు మళ్లిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



పరవళ్లు నారుమళ్లు!



కొనసాగుతున్న కృష్ణానదిలో వరద ప్రవాహం

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సాగర్ జలాశయం నీటి మట్టం 567 అడుగులకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో మరో వారం రోజుల్లో డ్యాం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల్లో సాగర్ కుడి కాల్వకు సాగు నీటి సరఫరాకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. సాగు నీటి విడుదల సమాచారం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. దీంతో వరి నారు మళ్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు.

- నిండుకుంటున్న జలాశయాలు
- 567 అడుగులకు చేరిన సాగర్ డ్యాం నీటి మట్టం
- పది రోజుల్లో కుడి కాల్వకు సాగు నీటి విడుదల
- వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం
- నీటి వనరుల ప్రాంతాల్లో వరి నారుమళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువులు, వాగులు, బావులు, మోటార్లు ఇలా నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి నారు మళ్లు పోస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేసిన వెంటనే నాట్లు వేసేలా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎక్కువ శాతం మంది రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేశారు.

నిండుకుంటున్న సాగర్ జలాశయం

సాగర్ జలాశయానికి 67,525 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. శ్రీశైలం జలాశయానికి.. వరద ప్రవాహం పెరిగింది. 1,56,516 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో సాగర్‌కు శ్రీశైలం నుంచి నీటి విడుదల పెంచనున్నారు. ఇదే తరహాలో నీటి ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల (మిగతా 7వ పేజీలో)



ఈపూరు: ఎర్రబాలెంలో వరినారుకు విత్తనాలు చల్లుతున్న రైతులు

జిల్లాలో భారీ వర్షం

సత్తెనపల్లిలో 87.5 మిమీ వర్షపాతం నమోదు

నరసరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం భారీగా వర్షాలు కురిశాయి. సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట పట్టణాల్లో భారీ వర్షం కురిసింది. సత్తెనపల్లి పట్టణంలో 87.5 మిమీ వర్షపాతం నమోదైంది. నాదెండ్ల మండలంలో 24.5 మిమీ, క్రోసూరు 39, నూజెండ్ల 38, నరసరావుపేట 35.5, చిలకలూరిపేట 27.25, అమరావతి 22.5, పిడుగురాళ్ల 19 మిమీ వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో కూడా ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు పంటల సాగుకు అనుకూలమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



అన్నదాత సుఖీభవకు 23 వరకు అవకాశం

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో జాబితాలు
- పేరు లేకుంటే రైతులు అర్జీలు అందజేయవచ్చని ప్రకటన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు వ్యవసాయ శాఖ చివరి అవకాశం కల్పించింది. ఇప్పటికే ఆర్ఎస్‌కేలలో ప్రకటించిన జాబితాల్లో పేరు లేని రైతులు అర్జీ దాఖలు చేసుకునేందుకు 23వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే పేరు లేని రైతులు ఎలా అర్జీ ఇవ్వాలో పూర్తి వివరాలను వ్యవసాయ కార్యదర్శి తెలియజేస్తారు. రైతులకు ఎక్కడైతే భూమి ఉందో ఆ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. భూమి పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్ వివరాలను ఆర్ఎస్‌కేలలో అందజేస్తే అర్హులైతే రైతుల పేర్లను నమోదు చేస్తారు. రీసర్వే చిక్కుల వల్ల కొందరు రైతులు సుఖీభవను కోల్పోతున్నారు. ఈ క్రాప్ నమోదైన కౌలు రైతులకు సుఖీభవ అందించనున్నారు. అంటే కౌలు రైతులు ఈ క్రాప్ నమోదు అయ్యే వరకు వేచి చూడాల్సిందే. రైతు సేవా కేంద్రాలతో పాటు అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్ ద్వారా కూడా అర్హత తెలుసుకోవచ్చు. ఆధార్ నెంబర్ ఎంటర్ చేసే అర్హత ఉందీ లేనిది తెలుస్తుంది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా కూడా స్టేటస్ తెలుసుకోవచ్చు.



ఇర్లపాడు సమీపంలో మలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావి

ఆదమరిస్తే.. బావిలోకే..

నాదెండ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కన నేల బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధానంగా ఇర్లపాడు, ఎండుగుంపాలెం మార్గంలో మలుపు వద్ద రెండు వైపులా వ్యవసాయ బావులు ఉన్నాయి. ఆదమరిచి ఎవరైనా వాహనం నడిపితే నేలబావిలోకి వెళ్లాల్సిందే. ఈ మార్గంలో రాకపోకలు చేసే వారు ఈ నేల బావులతో ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పాఠశాలల బస్సులు వెళ్తుంటాయి. అదేవిధంగా ద్విచక్ర వాహనాలపై పెద్దసంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. రెండు వైపులా బావులు ఉన్నా అధికారులు కనీస భద్రతా చర్యలు పాటించడంలేదని వాహనచోదకులు తెలిపారు.

జడ్పీ ఫైల్స్



బిల్లుల చెల్లింపుల్లో మీన మేషాలు

- చర్చనీయాంశంగా 'విద్యాజ్యోతి' బిల్లుల చెల్లింపు
- 9 నెలల నుంచి రూ.80 లక్షల ఫైల్ పెండింగ్
- పర్సంటేజీ తేలందే ముందుకు కదలని వైనం?
- మెటీరియల్ క్వాలిటీ పరీక్ష ఓకే.. అయినా వేధింపులు



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు అందజేసిన మెటీరియల్

నాకేంటి.. ఆహా నాకేంటి అంట.

ఇదీ బిల్లుల చెల్లింపు సమయంలో.. కాంట్రాక్టర్లకు జిల్లా పరిషత్ అధికారుల నుంచి వస్తున్న ప్రశ్న. పర్సంటేజీలు తేలందే.. కొన్ని ఫైల్స్ ముందుకు కదలడం లేదన్న విమర్శలు జడ్పీలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా జడ్పీ హెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పథకం కింద స్టడీమెటీరియల్ అందజేసిన కాంట్రాక్టర్‌ను చూపుతున్నారు. తొమ్మిది నెలలు దాటినా సదరు గుత్తేదారును కీలక అధికారి బిల్లుల చెల్లింపు విషయంలో వేధింపులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పర్సంటేజీ తేలందే ఫైల్ ముందుకు కదలదని ఉన్నతాధికారి భీష్మించుకున్నట్లు చర్చ నడుస్తోంది.

మూడు జిల్లాలకు.. 35 వేల పుస్తకాలు

విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు 2024-25 సంవత్సరానికి మొత్తం 35 వేల పుస్తకాలు సరఫరా చేశారు. గుంటూరు జిల్లా కు 11,806, పల్నాడు జిల్లాకు 17,657, బాపట్ల జిల్లాకు 5,284 చొప్పున తెనాలి కి చెందిన సంస్థ సరఫరా చేసింది. సుమారు 550 పేజీలకు పైగా ఉన్న ఒక్కో పుస్తకం ఖరీదు రూ.177గా ఉంది. పేద విద్యార్థులకు అవసరమయ్యే.. మెటీరియల్ కావడంతో అతి తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

గుంటూరు సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూ రు జిల్లా పరిషత్‌లో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. కొన్ని ఫైల్స్‌ను కీలక అధికారు లు అర్థంతరంగా తొక్కి పెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో ఫైల్‌ను నెలల తర బడి పెండింగ్‌లో పెడుతూ ఉండడం అత్యంత వివాదాస్పదమవుతోంది. తాజాగా విద్యా జ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు పుస్తకాలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌కు సుదీర్ఘ కాలం బిల్లులు చెల్లించని వైనంపై దుమారం రేగుతోంది. తొమ్మిది నెలలు గడచినా.. కీలక అధికారి మీనమేషాలు లెక్కిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. బిల్లు చెల్లింపులు కోసం భారీ మొత్తంలో ఆశించి.. ఫైల్‌ను నెలలు తరబడి తొక్కి పెట్టడంతో బాధితులు రోడ్డెక్కే పరిస్థితి దాపురించింది.

విద్యాజ్యోతి సంగతి ఇదీ..

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఏటా జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ పథకానికి విద్యా జ్యోతి అని నామకరణం చేశారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఈ స్టడీమెటీరియల్ తయారు చేయడంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది. ఈ మెటీరియల్ చదవడం వల్లే 10 తరగతి పరీక్ష ఫలితాల్లో తనకు 596 మార్కులు వచ్చాయని కారంపూడి మండలానికి చెందిన విద్యార్థిని (మిగతా 7వ పేజీలో)

క్వాలిటీ పరీక్షలో ఓకే

పుస్తకాల ముద్రణ, పేపర్ నాణ్యతకు సంబంధించి హైదరాబాద్‌లోని ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా పరిషత్ అధికారులు లేఖ రాశారు. మార్చి 19న సదరు ఫైల్‌ను హైదరాబాద్‌కు పంపారు. అదే నెల 25న హైదరాబాద్ ప్రభుత్వ రంగ సంస్థ విద్యాజ్యోతి పుస్తకాల నాణ్యతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేసింది. అది వచ్చిన తర్వాత కూడా జడ్పీ అధికారులు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఫైల్ ను పెండింగ్ పెట్టడం వెనుక మర్మం ఏంటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

జగన్ ఆలోచనలు సమాజానికి ప్రమాదకరం
• ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
మద్యం కేసులో తిమింగలానికి త్వరలో శిక్ష : జీవీ
ఖాకీల తక్షణ స్పందన తల్లీకూతుళ్లను కాపాడింది
7

SCHOLARSHIP ALERT

Unnati 2-Towards a Better Future Scholarship

Description: CNH Industrial (India) Private Limited invites applications from students who are currently studying in Class 8 to 10 or in first-year ITI/Diploma courses in Gurgaon, Delhi, and Noida.
Eligibility: The school-level scholarship is for applicants studying in Classes 8 to 10, who have scored at least 60% in the previous academic year.
- For the ITI/Diploma level scholarship, the student must be studying in the first year of the course.
- Students from Gurgaon, Delhi, or Noida whose total family income does not exceed 5 lakh are eligible to apply.
- Children of Buddy4Study and CNH Industrial (India) Private Limited employees are not eligible to participate.

Prizes & Rewards: Scholarships up to 12,000 per year for up to three years for school students.
- Scholarship up to 18,000 per year for two years for Diploma/ITI students.

Last Date to Apply: 17-08-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/UTBF3

HOPE Engineering Scholarship by Schaeffler India 2025



Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.
Eligibility: The scholarship is open to female students across India enrolled in the first year of an engineering program at any UGC or state-recognised college. Preference will be given to students with disabilities and those pursuing core engineering branches such as Automobile, Mechanical, Mechatronics, Electrical and Electronics, Electronics and Communication, Production, Instrumentation, Computer Science Engineering, and Information Technology. Applicants must have scored over 60% in Class 12 (Science) (40% marks for PwD) in the academic year 2024–25, with an annual family income of less than INR 5 lakh.
Prizes & Rewards: Scholarship of INR 50,000 per year for four years
Last Date: 30-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/SIHE16

ఐఐటీలు అందించే ఉచిత ఏరో ఇంజనీరింగ్ కోర్సులు

ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోని కొన్ని ఐఐటీలు ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతోపాటు వీటిని కూడా చేయవచ్చు.



దేశంలో ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు ఈ ఉచిత ఆన్‌లైన్ కోర్సులను డెవలప్‌చేశాయి.

ఇంట్రడక్షన్ టు ఏరోస్పేస్ ఇంజనీరింగ్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ రంగం పట్ల బేసిక్ అవగాహన కల్పించడానికి ఈ కోర్సును ప్రారంభించారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఎయిర్‌క్రాఫ్ట్, వాటి ఫీచర్స్, కాన్ఫిగరేషన్ సెలెక్షన్, టైప్స్ ఆఫ్ లోడ్స్, ఆపరేషనల్ ఇష్యూస్ తదితారాలన్నింటినీ బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఎలిమెంట్స్ ఆఫ్ మెకానికల్ వైబ్రేషన్: ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. వైబ్రేషన్ థియరీ ఫండమెంటల్స్ ప్రాక్టికల్ ఎగ్జామ్‌పుల్స్ తదిరాలు ఇందులో ఉం టాయి. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్, ఫ్లైట్ టెస్టింగ్, ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్ తదితరాలను వివరిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఎయిర్ క్రాఫ్ట్ స్టెబిలిటీ అండ్ కంట్రోల్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్‌ప్లేన్ స్టెబిలిటీ, కంట్రోల్ విషయాలను బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

డిజైన్ టు ఫిక్స్‌డ్ వింగ్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 జూలై చివరి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

యూఏవీ డిజైన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ప్రొపల్షన్ థియరీ, ప్రాక్టికల్స్‌పై క్లాసులు ఉంటాయి. ఎయిర్ క్రాఫ్ట్, రాకెట్ ఇంజన్ల డిజైన్, ఆపరేషన్, ఇన్‌స్టాలేషన్, రిపెయిర్, మెయింటెనెన్స్‌పై అవగాహన పెంచుతారు.

అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పేస్ ఫ్లయిట్ మెకానిక్స్: ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది.

దిక్సూచి

గేట్ స్కోరు లేకుండా గౌహతి ఐఐటీలో ఎంటెక్

ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై గౌహతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కొత్త ఎంటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పనిచేసే వారిని ఉద్దేశించి ఈ కోర్సును ప్రారంభించినట్లు ఐఐటీజీ తెలిపింది. ఈ కోర్సులో చేరడానిని గేట్ స్కోరు అవసరం లేదు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు. సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించే ఈ కోర్సు చేరాలనుకునేవారికి కనీసం ఒక సంవత్సరం వాటర్ రిసోర్స్ సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాగే కనీసం 6 జీపీఏతో నాలుగు సంవత్సరాల గ్రాడ్యుయేషన్ కోర్సు(సివిల్/ అగ్రికల్చర్ అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులు చేసి ఉండాలి. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా హైబ్రీడ్ మోడల్‌లో జరుగుతుంది. ఆన్‌లైన్‌లో క్లాసులు ఉంటాయి. ల్యాబ్‌లు, ఫైనల్ పరీక్షలు క్యాంపస్‌లో నిర్వహిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
వెబ్‌సైట్: www.iitg.ac.in/oes/odp/mtech/fwrm

జాబ్ కార్నర్

ఏపీపీఎస్సీలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

ఖాళీలు 691

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ 256, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ 435 పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇస్తారు.
వయస్సు: 2025 జూలై 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనల మేరకు వయస్సు సడలింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్స్, మెడికల్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 5
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ఎయిమ్స్‌లో

ఖాళీలు 3,501

దేశ వ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో 3,501 పోస్టుల భర్తీకి న్యూఢిల్లీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ కూడా గ్రూప్-బీ, గ్రూప్-సీ కేడర్ నాన్ ఫ్యాకల్టీ పోస్టులు.
పోస్టులు: డైటీషియన్, అసిస్టెంట్ డైటీషియన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, లాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, అటెండెంట్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్ టెక్నీషియన్, అటెండెంట్ తదితరాలు ఇందులో ఉన్నాయి.
అర్హత: పోస్టును బట్టి టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఈ, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ తదితరాలు ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుభవం కూడా ఉండాలి.
వయస్సు: పోస్టును బట్టి 18 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ తదితరాలు ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
సీబీటీ పరీక్ష తేదీలు: 2025 ఆగస్టు 25, 26
వెబ్‌సైట్: https://rrp.aiimsexams.ac.in/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో

ఖాళీలు 3,717



కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద 3,717 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.
పోస్టులు: అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-11/ ఎగ్జిక్యూటివ్. మొత్తం 3717 పోస్టులు ఉన్నాయి. అందులో అన్ రిజర్వుడు 1537, ఈడబ్ల్యూఎస్‌లో 442, ఓబీసీ 946, ఎస్సీ 566, ఎస్టీ 226 పోస్టులు ఉన్నాయి. ఇది జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సీ పోస్టు(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టిరియల్)
విద్యార్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయస్సు: 2025 ఆగస్టు 10 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనలు అనుసరించి వయస్సులో సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. టైర్-1 వంద మార్కులకు ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు కట్ చేస్తారు.
- టైర్-1 డిస్క్రిప్టివ్‌గా ఉంటుంది. దీనికి 50 మార్కులు. ఎస్సే, ఇంగ్లిష్ కాంప్రిహెన్షన్, లాంగ్ ఆన్సర్ తరహా ప్రశ్నలు ఉంటాయి. టైర్-3 వంద మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 10 **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en

చిత్రజ్యోతి

SINCE 1965

మన చరిత్ర చెప్పాలనే ప్రయత్నం

- అశ్విన్ కుమార్



పురాణాల్లోని దశావతారాల ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి యానిమేషన్ త్రీడీ చిత్రం 'మహావతార్ నరసింహ'. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ నిర్మించారు. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు.

- నరసింహ స్వామి అవతారం కేవలం ఒకపురాణ గాథ కాదు. మన చరిత్ర. దాని గురించి ప్రతి తరానికీ చెప్పాల్సిన అవసరం ఉంది. నేటి బాలలకు మన సంస్కృతి గురించి అవగాహన కలిగించేలా ఈ సినిమా ఉంటుంది. ఇప్పటివరకూ చూడని విజువల్స్‌ను బిగ్‌స్ర్కీన్ మీద చూడబోతున్నారు. వార్ సీక్వెన్స్‌లు చాలా అద్భుతంగా ఉంటాయి. సరికొత్త అనుభూతిని పంచుతాయి.
- భారీ బడ్జెట్‌తో మంచి నిర్మాణ విలువలతో తీసిన సినిమా ఇది. చరిత్ర, సంస్కృతి, ధార్మిక అంశాల మేళవింపుగా తెరకెక్కించాం. గీతా ఆర్ట్స్ తెలుగులో విడుదల చేయడం ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తుంది.
- శ్రీ మహావిష్ణువు దశావతారాలను బిగ్ కాన్వాస్‌లో చూపించాలనే ఆలోచనతో మహావతార్ యూనివర్స్ మొదలైంది. ఈ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. నటీనటుల ఇమేజ్ దేవుడి పాత్రలను డామినేట్ చేసే అవకాశం ఉంటుంది కాబట్టే యానిమేషన్‌లో అయితేనే ఇలాంటి కథకు న్యాయం చేయగలం అని భావించాం.

ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది



- ప్రవీణ పరుచూరి

'ఒక మంచి సినిమాను తీయడం దాన్ని ప్రేక్షకుల చెంతకు చేర్చడం చాలా కష్టం. ఎన్నో అడ్డంకులను అధిగమించి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది. మానవ సంబంధాల్ని చక్కగా చూపించారు అని అందరూ ప్రశంసిస్తున్నారు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. మనోజ్ చంద్ర, మోనిక హీరో హీరోయిన్లుగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతున్నారు. రామకృష్ణ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అయిన విధానం, సినిమాను ఆస్వాదిస్తున్న తీరు ఆనందాన్నిస్తోంది. నా సినీ గమనాన్నే మార్చిన పాత్ర చేశాను. మంచి సినిమాతో ప్రేక్షకులను అలరించాలనే కోరిక నెరవేరింది' అని అన్నారు. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని దర్శకురాలు తెరపై ఎంతో సహజంగా చూపించారు కాబట్టే సినిమా విజయవంతమైంది అని నిర్మాతలు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలసిన దుల్కర్ సల్మాన్



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల వేడుకల్లో 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దుల్కర్‌ను ఉత్తమ నటుడి పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అయితే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి దుల్కర్ హాజరు కాలేకపోయారు. ఆదివారం దుల్కర్ సల్మాన్ తన టీమ్‌తో కలసి సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనతో పాటు నిర్మాతలు స్వప్న దత్, సుధాకర్ చెరుకూరి తదితరులు ఉన్నారు.

పవన్‌కు జోడీగా



హీరోయిన్ రాశీ ఖన్నా ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండడంతో శ్రీలీలను ఇప్పటికే ఓ కథానాయికగా ఖరారు చేశారు. మరో కథానాయికగా రాశీని ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో పవన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటోంది. సినిమాలో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్, హరీశ్ కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



బాలీవుడ్ నటుడు సోనూసూద్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ముంబైలోని తన నివాసం దగ్గర్లో విషపూరితం కాని ఒక పామును ఆయన ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వీడియోను తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది మీరు ప్రయత్నించొద్దు. ఇటువంటి పరిస్థితి ఎదురైతే నిపుణులను సంప్రదించండి. జాగ్రత్తగా ఉండండి' అని పేర్కొన్నారు.

డాన్ దర్శకుడు చంద్ర బారోట్ కన్నుమూత



అమితాబ్ బచ్చన్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ క్లాసిక్ హిట్ 'డాన్' దర్శకుడు చంద్ర బారోట్ (86) కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ నటించి, నిర్మించిన పలు చిత్రాలకు చంద్ర సహాయ దర్శకుడిగా పనిచేశారు. 'డాన్' సినిమాను అద్భుతంగా తెరకెక్కించి, తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ హిట్‌ను అందుకున్నారు. 1990లో ఆయన తెరకెక్కించిన బెంగాలీ చిత్రం 'ఆశ్రిత' ప్రేక్షకాదరణ పొందింది. తన సినిమా కెరీర్ సజావుగా సాగకపోవడంతో చంద్ర బారోట్ సినిమాల నుంచి వైదొలగి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో కొనసాగారు. 'డాన్' చిత్రం పలు భాషల్లో రీమేక్ అయింది. తెలుగులో ఎన్టీఆర్ హీరోగా 'యుగంధర్' పేరుతో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. అమితాబ్ సహా పలువురు బాలీవుడ్ తారలు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇండస్ట్రీకి చెందిన మహిళా స్టంట్‌మాస్టర్స్‌ను సత్కరించింది. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్, సీనియర్ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా అపూర్వ లాఖియా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ వాసి కల్నల్ బికుమళ్ల సంతోష్‌బాబు జీవితం ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. ముంబైలో జరిగే ఈ షెడ్యూల్‌తో సల్మాన్ ఖాన్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఇందులో కథానాయకుడి గతానికి సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ సినిమాలో శక్తిమంతమైన యుద్ధవీరుడిగా కనిపించేందుకు సల్మాన్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఇందుకోసం శిక్షణ కూడా తీసుకున్నారు.

అజిత్‌కు తప్పిన ప్రాణాపాయం



కారు రేసింగ్ పోటీల్లో పాల్గొన్న హీరో అజిత్ కుమార్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయన అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇటలీలో జీటీ4 కార్ రేసింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో అజిత్ కుమార్ రేసింగ్ జట్టు కూడా పాల్గొంటోంది. ఆ సందర్భంగా అజిత్ కుమార్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ పోటీల్లో ముందుభాగంలో దూసుకెళుతున్న కారు ఒకటి ఉన్నట్టుండి అడ్డుగా రావడంతో ఆ కారును అజిత్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. అయితే, అజిత్ మాత్రం అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆడిషన్ల పేరిట మోసాలను అడ్డుకోవాలి

రకరకాల పేర్లతో ఏర్పాటవుతున్న నకిలీ సినీ అసోషియేషన్లు ఆడిషన్ల పేరిట మోసాలకు పాల్పడుతున్నాయి, సినీ ఇండస్ట్రీకి చెందిన యూనియన్‌లు అన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఇలాంటి మోసాలను అడ్డుకోవాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సినీరంగం పట్ల ఆసక్తి ఉన్నవారు నిజమైన సినీ సంఘాలను సంప్రదించి, వారి ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టాల'ని సూచించారు. ఏపీలో కొన్ని చోట్ల ఆడిషన్ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూసేవాళ్లను అడ్డుకున్నామని తెలిపారు. ఎటువంటి అవగాహన లేకుండా కొందరు యూనియన్లు ఏర్పాటు చేసి చిన్న కళాకారులు, టెక్నీషియన్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారనీ దీనిపై చిత్ర పరిశ్రమ పెద్దలు స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ వ్యవస్థాపకులు అంబటి మధుమోహన్ కృష్ణ కోరారు.

ఆగని గ్రానైట్ దందా

(5వ పేజీ తరువాయి)

వసూళ్ల టెండర్ గత ప్రభుత్వంలోనే దక్కించుకుంది. అనధికారిక రవాణా విషయంలో ఈ సంస్థ ఇచ్చే టోకెన్ కూడా సరిహద్దుల దగ్గర పనిచేస్తున్నాయని సమాచారం. ఇది కాకుండా జీఎస్టీ కూడా గ్రానైట్ వ్యాపారులు చెల్లించాలి. ఒక్కో లారీకి రూ.70,000 నుంచి లక్ష వరకు వివిధ రూపాలలో ప్రభుత్వానికి ఆదాయం లభించే అవకాశం ఉంది. నిబంధనలకు పాతరేసి లారీకి రూ.35,000 నుంచి రూ.45,000 కప్పం చెల్లిస్తే చాలు దర్జాగా సరిహద్దులు దాటిస్తున్నారు. అలా వసూలు చేసిన మొత్తాల్లోనే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి కొంత, వ్యవస్థలకు కొంత, సింహభాగం మాత్రం అధికార పార్టీ నేతల అనుచరగణానికే. ఈ అడ్డగోలు దందాలకు ఆపితే ప్రభుత్వ ఖజానాకు నెలకు అక్షరాల పది కోట్లు ఆదాయం సమకూరుతుంది.

ఆధిపత్యపోరుతోనే..

పన్నులు చెల్లించకుండా మార్టూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న 11 గ్రానైట్ లారీలను జూన్ 24న పల్నాడు జిల్లాలోని సరిహద్దుల వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. శనివారం పల్నాడు జిల్లా తంగెడ వద్ద మరో 14 లారీలను పట్టుకున్నారు. లారీలను పట్టుకున్న అధికారులపై ప్రైవేటు సైన్యం వాగ్వాదానికి దిగిందనే ప్రచారం ఉంది. ఈ రెండు ఉదంతాలకు సంబంధించే జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు రూ.60 లక్షలకు పైగా జమైంది. దీనిని బట్టి గ్రానైట్ రవాణాలో మాఫియా పాత్ర లేకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల గలగలే. ఈ మొక్కుబడి పట్టివేతలు ఆధిపత్య పోరులో భాగంగానే అనే ప్రచారం జోరుగా నడుస్తోంది. వాటాల పంపకాలలో నేతల అనుచరుల మధ్య వచ్చిన తేడాల్లో భాగంగానే తమ పరిధిలో ఉన్న అధికారులను ప్రయోగించి దారికి తెచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని గ్రానైట్ వ్యాపారులు చెబుతున్నారు.

జడ్పీ 'ఫైల్స్'!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించింది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మెటీరియల్‌ను తెనాలికి చెందిన ప్రముఖ ప్రింటర్స్ కారు చౌక ధరకు ముద్రించి.. పేద పిల్లలకు అందజేస్తున్నారు.

9 నెలలు దాటినా

విద్యాజ్యోతి మెటీరియల్ టెండర్లు ముగిసి తొమ్మిది నెలలు దాటింది. 35 వేల పుస్తకాలు పంపిణీ చేసినందుకు రూ.80 లక్షలు వరకు బిల్లులు చెల్లించాలి. జడ్పీ అధికారులు మాత్రం ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

పర్సంటేజీ కోసం పట్టు?

కొన్ని కీలకమైన ఫైళ్ల నెలల తరబడి పెండింగ్ ఉండటం వెనుక అసలు సంగతి వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు తమకు రావాల్సిన పర్సంటేజ్ ఫైనల్ అయిన తర్వాతే కొన్ని ఫైళ్ల పరుగులు పెడుతున్నట్లు చెబుతున్నారు. విద్యా జ్యోతి ఫైల్ కూడా అందుకే పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతుంది.

పరవళ్లు.. నారుమళ్లు !

(5వ పేజీ తరువాయి)

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో కుడి కాలువ ఆయకట్టులో సాగుకు భరోసా వచ్చింది.

రాయితీ విత్తనం మాటేంటి?

సాగర్ కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఒకవైపు జలవనరుల శాఖ సమాయత్తమవుతుండగా.. వ్యవసాయ శాఖ మాత్రం సాగుపై ఇంకా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే వరి విత్తనాల నిల్వలు సిద్ధం చేసి.. రైతులకు రాయితీపై సరఫరా చేయాల్సి ఉంది. కానీ, వ్యవసాయశాఖ విత్తన పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన రాయితీని వారు కోల్పోతున్నారు. జిల్లాలో 1,33,400 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు వరి విత్తనం సిద్ధం చేయలేదు. జిల్లాలో 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బీపీటీ-5204, జేజీఎల్ -354, కేఎన్ఎం-1638, ఎన్ఎల్ఆర్-34449,అంకుర్ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ-2782, బీపీటీ-2846 రకాల విత్తనాలు సరపడా నిల్వలు డీలర్ల వద్ద ఉంచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారే తప్ప. క్షేత్రస్థాయిలో చర్యలు కానరావడం లేదు.

శాకంబరిగా భ్రమరాంబకు పూజలు

● అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు



పెదకాకాని, జూలై 20(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భ్రమరాంబ అమ్మవారికి శాకంబరిగా అలంకరణ చేశారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్‌తో వైభావోపేతంగా అలంకరించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు దేవస్థానానికి మేళతాళాల మధ్య చేరకుని అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. అర్చకులు మల్లేశ్వరస్వామికి, భ్రమరాంబకు నరేంద్రకుమార్ దంపతులతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాకంబరీ దేవి అలంకరణలో భ్రమరాంబ అమ్మవారని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు బోయపాటి రామ్మోహన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.



అమ్మవారికి ఆషాఢ సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు

జగన్ ఆలోచనలు సమాజానికి ప్రమాదకరం

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): హింస, అవినీతితో రాజకీయాల్లో రాణించాలనే జగన్ ఆలోచనలు రాష్ట్రానికి ప్రమాదకరంగా మారుతున్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు విద్యానగర్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు వంటి కొత్త సంస్కృతిని జగన్ తీసుకువచ్చాడని మండిపడ్డారు. పేర్ని నాని లాంటి నాయకులు హింసను ప్రోత్సహిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. మహా భారతంలో ధర్మరాజుకు కోపం వస్తే ఏమి జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తో పాటు కూటమి నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనించి ఆ పార్టీకి, జగన్‌కు దూరంగా ఉండాలని హితవు పలికారు. పరామర్శ పేరుతో జగన్ బల ప్రదర్శన చేస్తున్నాడని.. ఏ సీజన్‌లో ఏ పంటలు పండిస్తారో తెలియని అతను న్యాయం చేస్తాడని రైతులు అనుకోవడం లేదన్నారు. గంజాయి తప్ప ఇతర పంటలపై జగన్‌కు అవగాహన లేదని యరపతినేని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం, ఇతర కుంభకోణాలపై విచారించి నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. విషపు రంగు నీళ్ల అమ్మి పేదల రక్తాన్ని జలగల మాదిరి పీల్చిన వారిని ఎందుకు వదిలి పెట్టాలని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో గురజాల నియోజకవర్గంలో 11 మంది టీడీపీ కార్యకర్తలను చంపారని, మైనింగ్ గుంతల్లో ఆరుగురు చిన్న పిల్లలు చనిపోయారని.. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని చెప్పారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన రూ.1,200 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతంలో మరో రెండు సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గురజాల, ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పోరాట యోధుడు శేషగిరిరావు : ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో పాలువాయిగేటులో పోలింగ్ రోజున వైసీపీ అల్లరి మూకలు దాడి చేస్తున్నా అదరకుండా బెదరకుండా వారి అరాచకాలు, దౌర్జన్యకాండకు ఎదురొడ్డి నిలబడిన పోరాట యోధుడు నంబూరి శేషగిరిరావని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యువనేత యరపతినేని నిఖిల్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం శేషగిరిరావు మృతదేహాన్ని సందర్శించి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీ కోసం పని చేసిన శేషగిరిరావు గురించి చెప్పాలంటే మాటలు రావడం లేదని చెమర్చిన కళ్లతో పేర్కొన్నారు. మే 13, 2024న శేషగిరిరావుపై దాడి జరిగిన తీరును తెలుసుకున్న తాను పాలువాయిగేట్‌కు వచ్చానని, దెబ్బలంటే లెక్క లేదు కానీ, సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా తాను గెలవాలని శేషగిరిరావు కోరినట్లు బ్రహ్మారెడ్డి గుర్తు చేశారు. ఓ వైపు రక్తం కారుతున్నా బాధను పంటిబిగువున పెట్టుకుని పార్టీ కోసం పరితపించిన వ్యక్తి శేషగిరిరావన్నారు. వారి కుటుంబ సంక్షేమానికి పార్టీ ఇతోధికంగా సాయం అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి,యరపతినేని నిఖిల్

వెబ్ ఆప్షన్స్ గడువు పొడిగింపు

లాంఫాం(తాడికొండ)జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్లమా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు.. వెబ్ ఆప్షన్స్ గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం తిరుపతి కళాశాలలో అగ్రికల్చర్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతించటం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, జూలై 20, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని నూజండ్ల రైల్వే గేటు వద్ద ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై శ్రీనివాసరావు వివరాల మేరకు.. మండలంలోని పిట్టబండ గ్రామానికి చెందిన జక్కంపూడి రామారావుకు(29) కొంత కాలంగా మతి స్థిమితం లేదు. వినుకొండలోని కుమ్మరి బజారులో ఉన్న అన్న వద్ద ఉంటున్నాడు. తెల్లవారు జామున బహిర్భూమికి రావడంతో రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి.. సెల్‌ఫోన్‌తో పరార్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై20(ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడమే కాకుండా.. వాహనదారుల సెల్‌ఫోన్, బైక్ తాళం లాక్కొని పారిపోయిన ఘటన చేబ్రోలు - నారాకోడూరు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. బాధితులు వివరాల మేరకు.. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన పుట్టపు పిచ్చియ్య, గాజులవర్తి కిషోర్ చేబ్రోలులోని బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. చేబ్రోలు- నారాకోడూరు మధ్య ఓ పెట్రోల్ వద్ద వీరిని వెనుక నుంచి ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. అంతలోనే కారు నుంచి దిగిన యువకులు వారి వద్ద ఉన్న సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం తాళం లాక్కుని అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పిచ్చియ్య, కిషోర్‌ను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

నరెడ్కో క్యాపిటల్ జోన్ గుంటూరు అధ్యక్షుడిగా అంకారావు

● ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు కార్పొరేషన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): నరెడ్కో క్యాపిటల్ జోన్ గుంటూరు అధ్యక్షుడిగా సీహెచ్ అంకారావును ఎన్నుకున్నారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పెరవలి నాగవంశీ, అధ్యక్షుడిగా కె.సి.అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంటుగా శ్రీనాథ్, యోగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి, ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.



నూతన కమిటీ సభ్యులు

రచయితలు బైరాగి, శారద శత జయంతి



శత జయంతి సభలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్

తెనాలి అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ రచయితలు ఆలూరి బైరాగి, శారద శత జయంతి కార్యక్రమం ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సాహిత్య అకాడమీ, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సభకు ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాన్ని దిశా నిర్దేశం చేసే రచనలు రచయితలు అందించారన్నారు. ఐతానగర్‌లో బైరాగి విగ్రహం ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, రవిబాబు, శ్రీనివాసరావు, ఆదిత్య, గుజ్జర్లమూడి కృపాచారి, శారద కుమార్తె శారద ప్రసంగించారు.

రషీద్ హత్య కేసులో నిందితులుగా మరో నలుగురు

వినుకొండటౌన్ జూలై 20, (ఆంధ్రజ్యోతి): వినుకొండలో గత ఏడాది జూలై 17న రషీద్ అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మరో నలుగురిని నిందితులుగా చేర్చాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు శనివారం ఆదేశించినట్లు వినుకొండ పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. హత్యానంతరం ప్రాథమిక దర్యాప్తు నివేదికలో నమోదు చేసిన 20 మంది నిందితుల్లో షఫీ, అర్షఫ్ మస్తాన్, జానీ, సాయిబా పేర్లను పోలీసులు అభియోగ పత్రంలో తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ హతుడి సోదరుడు ఖాదర్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సాక్షులను విచారణ మేరకు మరో నలుగురుని ఈ కేసులో నిందితులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీఐ సుభాషిని వివరణ కోరగా సోమవారం ఆర్డర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పప్పెట్రీతో బోధన సులభతరం

● జాతీయ వర్క్‌షాప్‌లో రావెల ఉపాధ్యాయిని



రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ బృందం

తాడికొండ(రావెల)జూలై 20(ఆంధ్రజ్యోతి): పప్పెట్రీ ద్వారా బోధన మరింత సులభతరం అవుతుందని, విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరని మండలంలోని రావెల ఏఎం స్కూల్ ఉపాధ్యాయురాలు బండి ఏస్తేరు రాణి పేర్కొన్నారు. కల్చరల్ అండ్ క్రాఫ్ట్ రిసోర్స్ సెంటర్ ఢిల్లీ, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనుబంధంగా జూలై 3 నుంచి 17 వరకు "పప్పెట్రి ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఇన్ లైన్ విత్ ఎన్ఈపీ-2020" వర్క్ షాప్ జరిగింది. ఇందులో దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల నుంచి 68 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏపీ నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా..అందులో ఏస్తేరు రాణి ఒకరు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ఏస్తేరు రాణి మాట్లాడుతూ.. తను నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేస్తామని చెప్పారు.

మద్యం కేసులో తిమింగలానికి త్వరలో శిక్ష

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ జూలై 20, (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో అసలు తిమింగలానికి త్వరలోనే శిక్ష తప్పదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రస్తుతం సిట్ అరెస్టులన్నీ చిన్న చేపలవేనన్నారు. పట్టణంలోని కల్యాణ్‌పురి కాలనీలో ఆదివారం రాత్రి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం విలేకరులతో జీవీ మాట్లాడారు. సాగర్ ఆయకట్టు రైతులకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం భట్టిప్రోలులోని పద్మశాలీయ బహోత్తమ సంఘం కార్యాలయంలో మార్కండేయ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించడంతో పాటు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి.. నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పద్మశాలీయ సేవా సంఘం సేవలను కొనియాడారు. సంఘం సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, బట్టు మల్లికార్జునరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చెట్టును ఢీకొన్న ట్రాలీ ఆటో - ఇద్దరికి గాయాలు

శావల్యాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు నుంచి వంకాయల లోడుతో బయలుదేరిన ట్రాలీ ఆటో తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కృష్ణాపురం సమీపానికి రాగానే అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆటోలో ఉన్న దమ్మవరపు బన్నీకి స్వల్పంగా గాయపడగా.. అతని తమ్ముడు శేఖర్ ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు.



ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన శేఖర్

ఖాకీల తక్షణ స్పందన తల్లీకూతుళ్లను కాపాడింది



తల్లీ కూతుళ్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెదుళ్ళపల్లి పోలీసులు

బాపట్లరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కుమార్తెలతో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు తక్షణం స్పందించి రక్షించారు. ఖాకీల సమయస్ఫూర్తితో ముగ్గురి నిండు ప్రాణాలను రక్షించగలిగారు. ఈ ఘటన స్వావర్ణపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నిస్తోందని వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్‌కు ఆదివారం ఉదయం ఫోన్ వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన ఎస్సై భాగ్యరాజు తన సిబ్బందితో కలిసి రైల్వేట్రాక్‌పై ఉన్న మహిళ, ఇద్దరు కుమార్తెలను చాకచాక్యంగా కాపాడారు. ఆత్మహత్యాయత్నానికి కుటుంబ వివాదాలే కారణమని తెలుసుకొని.. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు స్పందించిన తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఈ ఘటనపై స్పందించారు. కుటుంబ వివాదాలను కూర్చుని పరిష్కరించుకోవాలన్నారు. అప్పటికీ సమస్య తీరకపోతే.. పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కుటుంబ వివాదాల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని.. జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వేగంగా స్పందించి ముగ్గురుని కాపాడిన వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

మహిళకు వేధింపులు..వీఆర్వోపై కేసు

బెల్లంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన వీఆర్వో వెంకయ్యపై బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ.. తల్లికి వందనం పథకం కోసం సంతకం చేయాలని వీఆర్‌వో వద్దకు వెళ్లింది. అయితే వీఆర్వో వెంకయ్య కోరిక తీరిస్తేనే సంతకం పెడతానని వేధించడంతో.. బాధిత మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

రేషన్ కార్డులో పేర్లు తొలగింపునకు అవకాశం

సత్తెనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో పేర్లు తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే నెలలో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించగా తాజాగా రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆయన తెలిపారు. సత్తెనపల్లి పట్టణ, మండలంలో పలువురు మహిళలు వివాహం చేసుకొని వేరే ప్రాంతాలకు వెళ్లారు. ఐతే వారి పేర్లు రేషన్‌కార్డుల్లో నుంచి తొలగించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వం మార్పులకు అవకాశం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డుల్లో అన్ని రకాల మార్పులకు అవకాశం కల్పించటంతో కార్డుదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పారా క్రీడాకారుడు శ్యామ్‌ను సన్మానిస్తున్న భువనేశ్వరి



శ్యామ్‌ను సన్మానిస్తున్న భువనేశ్వరి

దుర్గి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దుర్గికి చెందిన పారా క్రీడాకారుడు శ్యామ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి దుశ్శాలువలతో సన్మానించి అభినందించారు. శ్యామ్ గత నెల జరిగిన పారా క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించారు. ఆదివారం విశాఖపట్నంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన తలసేమియా బాధితుల కోసం నిర్వహించిన రన్ వైజాగ్‌లో ఈ సన్మానం జరిగింది. కాగా శ్యామ్‌ను దుర్గికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ అభినందించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని ఎండ్రాయి గ్రా మానికి చెందిన గోగినేని వెంకటరమణను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు వై శశికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గోగినేని ఎంపికపై మండల నాయకులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

క్రోసూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో షేక్ దండు బుడే(38) అనే వ్యక్తి మరణించిన ఘటన అనంతవరం - దొడ్లేరు గ్రామాల మధ్య జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని దొడ్లేరుకు చెందిన దండు బుడే క్రోసూరులోని జానీ బాషా హోటల్‌లో పని చేస్తూ ఉంటాడు. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో హోటల్‌లో పనులు ముగించుకొని దొడ్లేరు గ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తున్నాడు. అనంతవరం దాటగానే ఎదురుగా వస్తున్న గేదెల గుంపును తప్పించబోయి వాటిని ఢీకొట్టాడు. వెంటనే బైక్ మీద నుంచి పడిపోయి అక్కడికక్కడే మరణించాడు. భర్త ఇంటికి రాకపోవటంతో భార్య నాగూర్‌బీ బుడే పని చేసే హోటల్‌కు ఫోన్ చేయగా బయలుదేరి వెళ్లాడని వారు చెప్పటంతో బంధువులతో కలసి క్రోసూరుకు వస్తుండగా అనంతవరం దాటిన తరువాత రోడ్డుపై పడిపోయిన బుడే మృతదేహం కన్పించింది. వెంటనే ఆమె క్రోసూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు క్రోసూరు ఎస్‌ఐ రవిబాబు తెలియజేశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలియజేశారు.

సుపరిపాలన-తొలిఅడుగు వంద శాతం పూర్తి

అచ్చంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపాలెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం వంద శాతం పూర్తి చేశారు. ఈ గ్రామంలో 1764 కుటుంబాలు ఉండగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో ముఖాముఖి చర్చించారు. ఐదు బూత్‌లలోని 164 కుటుంబాలు వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పెదపాలెం టీడీపీ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, నెల్లూరి శ్రీనివాసరావు, బుర్రి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల రాకతో పొలం బాట పట్టిన రైతులు

- పల్నాడులో విత్తనసాగుకు సమాయత్తం
- వరి సాగుకు మడులు సిద్ధంచేస్తున్నతీరు





వేమవరంలో ముమ్మరంగా పొలాల్లో అరకలు దున్నుతున్న రైతులు, విత్తనాలు నాటుతున్న మహిళలు

మాచవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): సుమారు నెల రోజులుగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు విత్తనాలు వేసే పరిస్థితి లేదు. అప్పట్లో కొద్దిపాటి వర్షాలకు విత్తనాలు వేసిన రైతులు మొక్కలు ఎండిపోతుంటే ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు, రైతు కూలీలు, పొలంబాట పట్టారు. జూన్ నెలలో సుమారు 25శాతం విత్తనాలు వేయగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నూరుశాతం విత్తనాలు వేస్తారని రైతులు తెలియజేస్తున్నారు. వర్షాలు కురవటంతో విత్తనాలు వేసేందుకు కూలీలు దొరక్క, సాళ్ళు వేసేందుకు అరకలు దొరక్క రైతులు కూలీల వద్దకు, అరకల యజమానుల వద్దకు ఉరుకులు, పరుగులు తీశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విత్తనాలు వేశామంటూ కూలీలు తెలియజేస్తున్నారు. అంతేగాకుండా ప్రాజెక్టులకు నీరు పుష్కలంగా రావటంతో వరి సాగు చేసే రైతులు కూడా నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు మొదటివారంలో సాగర్ కుడి కాలువకు నీరు వదులుతారన్న సంకేతాలు రావటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్త మవుతుంది.

ప్రారంభమైన విత్తన సాగు

పిడుగురాళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి పదునైంది. రైతులు పత్తి సాగు ప్రారంభించారు. గుత్తికొండ, జూలకల్లు, మోర్జంపాడు, మాదినపాడుతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం పత్తి విత్తనాన్ని రైతులు సాగుకు ఆరంభించారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో భూమి పదునుకావడానికి తోడు రాబోయే నాలుగు రోజులు వర్షాలు పడతాయన్న అధికారుల సమాచారంతో రైతులు ఎక్కువ మంది విత్తన సాగుకు సమాయత్తమయ్యారు.

కూటమి పాలనతో ఇంటింట సంతోషం

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- బుచ్చయ్యపాలెంలో సుపరిపాలన-తొలిఅడుగు

పెదకూరపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనతో ప్రతి ఇంటింట సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెంలో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌళిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఏడాది పాలనలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇంటింటికి స్వయంగా వెళ్లి ప్రజలతో మమేకమవుతూ వారి అభిప్రాయాలను, సమస్యలను ఎమ్మెల్యే ప్రవీణ్ తెలుసుకున్నారు. త్వరలో చేయనున్న నూతన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, జిల్లా నాయకులు పరుచూరి నాని, పఠాన్ నూర్జహాన్, మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, గ్రామ సర్పంచ్ క్రాపా పద్మజా వీరసింహం, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, మోదుగుల చంద్రశేఖర్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం అంజనేయులు, సహకార సంఘాల ఛైర్మన్‌లు ఏటుకూరి రత్నకుమార్, బాష్యం జగదీష్, 75 తాళ్ళూరు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వట్టికూటి శివరామకృష్ణ, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, గల్లా శివ, గంగినేని లీలావతి, మేదరమెట్ల సామిత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభం

బుచ్చయ్యపాలెంలో రూ.27 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూ షన్ ట్రాన్స్‌ఫార్మర్స్ మూడు యూనిట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.



రేణుకా అంకమ్మకి జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు

రేణుకా అంకమ్మకి అభిషేకం

పెదకూరపాడు మండలంలోని బుచ్చయ్యపాలెంలో రేణుకా అంకమ్మ దేవాలయంలో ఆదివారం పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

చివరి భూములకు సాగునీరు అందించటమే లక్ష్యం

- ఎర్రబాలెం మేజరు కాలువకు జేసీబీతో మరమ్మతులు
- టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు చివరి భూముల రైతులకు సాగునీరు అందించటమే కూటమి లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. ఆదివారం ఉదయం బెల్లంకొండ ఎర్రబాలెం మేజరు కాలువకు జేసీబీ సహకారంతో ముళ్లపొదలను, కాలువ మరమ్మతుల పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కూటమి కాలువల మరమ్మత్తులపై దృష్టి పెట్టి కాలువలను బాగు చేయించి ఆయకట్టు రైతులకు సకాలంలో పుష్కలంగా నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పుణ్యమా అంటూ కాలువలు బాగు పడుతున్నాయని, సకాలంలో చివరి భూములకు నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎర్రబాలెం మేజరు కాలువ ఛైర్మన్ మాచర్ల ముస్తఫా, నీటి సంఘం వైస్ ఛైర్మన్ గోవిందరెడ్డి, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, టీడీపీ నాయకులు పీఎస్‌కే రసూల్, కొండవీటి షేక్ అబ్దుల్ రజాక్, సయ్యద్ జానీ, మునగపాటి సుభానీ, గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, గుడిసె కొండయ్య, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబాలెం మేజరు కాలువకు జేసీబీ సహకారంతో మరమ్మతులను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు, గ్రామస్థులు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మస్తాన్ షరీఫ్ అన్నారు. ఆదివారం బెల్లంకొండలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్ళి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పీఎస్‌కే రసూల్, సర్పంచ్ జ్యోతి సముద్రం, సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు తరలిరండి

మాచర్లటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా నాయీ బ్రాహ్మణుల ఆరాధ్యదైవం గుర్రప్పస్వామి, మైసమ్మ తల్లికి సోమవారం పట్టణంలో బోనాల జాతరను నిర్వహిస్తున్నామని, ఈ బోనాల పండుగకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని నాయీ బ్రాహ్మణ సంఘం నేత మాచర్ల వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని కోదండ రామాలయం వద్ద నుంచి మేళతాళాలతో మహిళలు బోనాలతో గుర్రప్పస్వామి, మైసమ్మ తల్లి దేవాలయానికి చేరుకుంటారని చెప్పారు.

వాహనాల తనిఖీ

దుర్గి, జూలై 20(ఆంధ్రజ్యోతి): దుర్గి పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఎస్‌ఐ సుధీర్‌కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేది లేదని హెచ్చరించారు.

ఆలయ స్థలం ఆక్రమణ

- ఎమ్మెల్యేని ఆశ్రయించిన కమిటీ సభ్యులు
- చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు



ఆక్రమిత స్థలంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

దుర్గి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆలయ స్థలమే కదా ఎవరు అడుగుతారులే అని ఆక్రమణదారులు కబ్జాకు పూనుకున్నారు. కొందరు గదులను వేసి ఆక్రమించి విక్రయించగా, మరికొందరు గోడను నిర్మించి విక్రయించి రిజిష్టర్ కూడా చేశారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని ఆశ్రయించి తమ సమస్యను విన్నవించారు. దుర్గిలోని కోలగుట్ల రోడ్డులో శేషం వారి కుంట సర్వే నంబరు 234బీలో 92 సెంట్లు భూమి ఉంది. సదరు పోరంబోకు స్థలంలో పంచాయతీ అధికారులు పంపుహౌస్, సంప నిర్మించారు. మిగిలిన స్థలాన్ని 2007 ఏప్రిల్ 24వ తేదీన అప్పటి పంచాయతీ తీర్మానంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. అప్పటికే ఆ స్థలంలో కొందరు ఆక్రమణ దారులు రెండు గదులు నిర్మించి విక్రయించారు కూడా. అయితే అనివార్య కారణాలతో ఆలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరలా 2024లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సదరు స్థలంలో మరికొంత భాగంలో గోడను నిర్మించి విక్రయించడమే కాకుండా రిజిష్టర్ కూడా జరిగినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు శనివారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి సమస్యను విన్నవించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆక్రమిత స్థలాన్ని తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. స్థలానికి సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు.

రూ.30 వేల కోసం కట్టేసి కొట్టారు

- మద్యం బాకీ కోసం దమ్మాలపాడులో దారుణం
- ఎస్పీకి ఫిర్యాదుతో వచ్చి విడిపించిన పోలీసులు

ముప్పాళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రూ.30 వేల నగదును చెల్లించలేదని ఓ వ్యక్తిని కట్టేసి కొట్టిన ఘటన ముప్పాళ్ల మండలంలోని దమ్మాలపాడులో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్పీకి ఫిర్యాదుతో పోలీసులు వచ్చి అతడ్ని విడిపించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. దమ్మాలపాడుకు చెందిన గంధం నాగేంద్రబాబు అనే వ్యక్తి వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో మద్యం బెల్ట్‌షాపు నిర్వహిస్తూ ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన దమ్మాలపాటి రవి అతడి బెల్ట్‌షాపులో మద్యం తాగేవాడు. ఇలా మద్యం నగదు రూ.30 వేలకు చేరింది. ఆ తర్వాత మూడేళ్ల క్రితం రవి కుటుంబాన్ని గుంటూరుకు మార్చాడు. మద్యం నగదు కోసం కోసం తరచూ నాగేంద్రబాబు అడుగుతున్నా రవి నుంచి స్పందనలేదు. ఈ క్రమంలో సోదరి విజయను చూసేందుకు శుక్రవారం రాత్రి రవి గ్రామానికి వచ్చాడు. ఇతడి రాక గురించి తెలుసుకున్న నాగేంద్రబాబు, దమ్మాలపాటి వీరాంజనేయులు, వలేరు గోపి, షేక్ మదార్‌వలిల సహకారంతో రవిని పట్టుకుని గ్రామంలోని బొడ్రాయి సెంటర్‌లో దిమ్మెకు కట్టేశారు. మద్యం మత్తులో ఉన్న నాగేంద్రబాబు, అతడి వర్గీయులు తెల్లవారుజాము వరకు రవిపై దాడి చేసి కొట్టారు. రవి మేనకోడలు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి నేరుగా ఎస్పీకి పంపింది. వెంటనే స్పందించిన ఎస్పీ ముప్పాళ్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని రవిని విడిపించి నిందితులు నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రవి సోదరి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు.


టీడీపీ నేత శేషగిరిరావుకి నివాళి



శేషగిరిరావు భౌతికకాయానికి టీడీపీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న యరపతినేని నిఖిల్

మాచర్లటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలం పాలువాయిగేటు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత నంబూరి శేషగిరిరావు హఠాన్మరణం చెందాడు. మృతదేహాన్ని కుర్రి శివారెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, తదితర నేతలంతా సంతాపం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శేషగిరిరావు పార్థివ దేహానికి టీడీపీ జెండాను కప్పి యరపతినేని నిఖిల్ నివాళులర్పించారు.

చెస్ క్రీడా సామగ్రి అందజేత



చెస్ సామగ్రిని అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాచర్లటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పల్నాడు చెస్ అకాడమి సహకారంతో వాసవీ క్లబ్ ఆధ్వర్యాన శ్రీరామకృష్ణ సేవా సమితి కేంద్రానికి చెస్ క్రీడా సామగ్రిని అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు మాట్లాడుతూ పల్నాడు చెస్ అకాడమి సహకారంతో వాసవీక్లబ్ ఆధ్వర్యాన చెస్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, వాసవీక్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, పాపిరెడ్డి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ రవాణాను కట్టడి చేయాలి

పిడుగురాళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా నుంచి పల్నాడు జిల్లా మీదుగా కొన్ని గ్రానైట్ లారీలు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలివెళ్తుండటాన్ని సంబంధిత అధికారులు కట్టడి చేయాలని వైసీపీ వైద్యవిభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం పిడుగురాళ్లలో విలేకర్ల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణకు రోజుకు కొన్ని లారీల గ్రానైట్ అక్రమంగా రవాణా జరుగుతుండటం వల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందన్నారు. అధికారులు స్పందించి తగిన బిల్లులు చెల్లించి ప్రభుత్వానికి ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు బోనాలు సమర్పణ



గ్రామదేవతలకు బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు



శాకంబరీ దేవిగా పెద్దింటమ్మ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని అమరావతికి గ్రామదేవతలైన ముత్యాలమ్మ, పెద్దింటమ్మలకు గ్రామస్థులు బోనాలు సమర్పించారు. పట్టణంలోని గంటలమ్మ చెట్టు నుంచి మంగళవాయిద్యాలతో మహిళలు బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పెద్దింటమ్మ ఆలయాన్ని సందర్శించగా పండుగ వాతావరణం నెలకొంది. పెద్దింటమ్మను శాకంబరీ దేవిగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

దాచేపల్లిలోని మహాలక్ష్మమ్మ తల్లికి మొక్కు చెల్లింపు



దాచేపల్లిలో మహాలక్ష్మి తల్లికి బోనాలు తీసుకొని తరలివచ్చిన మహిళలు

దాచేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు, కుంకుమ బండ్లు, బొడ్డురాయికి నీరు, కప్ప తల్లి ఊరేగింపు వంటి పూజలతో భక్తులు దేవతలకు పూజలు నిర్వహిస్తున్నారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావటంతో అమ్మవారికి బోనాలు చెల్లింపులతో గణాచార్యులు వేపాకులతో గ్రామంలోని బొడ్డురాళ్ళకు నీరు వారుపోస్తూ అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాచేపల్లిలోని మహాలక్ష్మమ్మ తల్లికి కుల, మతాలకు అతీతంగా, ఐకమత్యంగా అమ్మవారికి బోనాలు చెల్లించారు. కేసానుపల్లిలో గ్రామ దేవతలైన గంగమ్మ, ముత్యా లమ్మ, మహాలక్ష్మి, బొడ్డురాళ్ళకు నీరు వారు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రామాపురం, శ్రీనివాసపురం, ముత్యాలంపాడు, తంగెడ, నడికూడి గ్రామాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తి దాయకం



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, కన్నా నాగరాజు తదితరులు

సత్తెనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నియోజకవర్గంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు కన్నా రంగయ్య ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సాహించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి భావంతులైన 84 మంది విద్యార్థులకు రూ.11.15 లక్షల ఉపకార వేతనాలను కన్నా లక్ష్మీనారాయణ, ఆర్డీవో రమణా కాంత్‌రెడ్డి, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, ట్రస్ట్ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, అంకాళ్ళ ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు. కన్నా రంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రీఓరియంటేషన్‌గా మార్చేందుకు రూ.75 లక్షలు

- విద్యుత్ శాఖ డీఈఈ సింగరయ్య



మాచర్లటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132కేవీ ఉపకేంద్రం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిందని, ఇందుకు అనుగుణంగా 33 కేవీలు 9 ఫీడర్లు రీఓరియంటేషన్‌గా మార్చేందుకు రూ.75 లక్షలు ఖర్చవుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ నూతలపాటి సింగరయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రీఓరియంటేషన్ చేయక ముందు 9 ఫీడర్లు అనేక రకాల క్రాసింగ్‌ల ద్వారా గతంలో టేకాఫ్ జరిగిందని, దీనివల్ల ఒక ఫీడర్ లైన్ వర్క్ చేయాల్సి వస్తే దాన్ని క్రాస్ చేస్తున్న మిగిలిన ఫీడర్లు కూడా ఆపి పనిచేయాల్సి వస్తుందన్నారు. అందువల్ల అంతరాయాల సమస్య ఎక్కువైందని, రీఓరియంటేషన్ తరువాత ఆ క్రాసింగ్‌లు మొత్త తొలగిపోతాయన్నారు. మాచర్ల మండలం చుట్టూ ఉన్న దుర్గి, వెల్దుర్తి, కారంపూడి, రెంటచింతల మండలాల్లో విద్యుత్ అంతరాయం తొలగిపోతుందన్నారు. దీనికి గాను రూ.25 లక్షలు ఖర్చు పెడుతున్నాయన్నారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా డివిజన్‌లోని 108 అగ్రికల్చర్, గ్రామాలకు అనుసంధానమైన ఫీడర్లను వ్యవసాయానికి, గ్రామానికి వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల గ్రామాలు, మండల హెడ్ క్వార్టర్లు, పట్టణాలు వ్యవసాయ కనెక్షన్లు ఉన్న ఫీడర్ల నుంచి వేర్వేరు చేసి 24 గంటలు త్రీఫేజ్ సప్లయి అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఇస్తారన్నారు. వ్యవసాయానికి 9 గంటలు పగటిపూట అంతరాయం లేని విద్యుత్‌ను అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా మాచర్ల డివిజన్‌లో ఎక్కువగా పనులు జరుగుతున్నాయని, వినియోగదారులు విద్యుత్‌సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని గ్రహించి సహకరించాలన్నారు. బకాయిలు సకాలంలో చెల్లించాలని కోరారు. అలా చేయకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ సింగరయ్య అన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన



సత్తెనపల్లి పట్టణంలో మోకాళ్ళపై మున్సిపల్ కార్మికుల నిరసన

సత్తెనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద మోకాళ్ళపై కూర్చొని తమ నిరసనను వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, పారిశుధ్య కార్మికులు తమ విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారు. సమస్యలను పరిష్కరించే వరకు తమ సమ్మె కొనసాగుతుందని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, కార్మికులు వెంకయ్య, చంద్రకళ, జల్ది రమేష్, సునీత, దుర్గ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. కార్మికులు సమ్మె శిబిరంలో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సత్వరమే స్పందించాలని సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో విజయ్, పూర్ణచంద్రరావు, సుభాని, విజయసారథి, మొగిలి నాగేశ్వరరావు, సురేష్, కంపా సాగర్, గద్దె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సమస్యలు పరిష్కరించాలని లోక్‌సత్తా నాయకుల వినతి

చిలకలూరిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నాయకులు తహసీల్దార్ హసేన్సన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు, వ్యక్తిగత వేడుకల పేరుతో రోడ్లను బ్లాక్ చేయడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ప్రజాధనంతో ప్రధాన రహదారులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే, అవి కనిపించకుండా ఫ్లెక్సీలు నెలకొల్పి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. డీజే సౌండ్ సిస్టం వలన అనేక అనర్థాలు ఉన్నాయని నిపుణులు ఘోషిస్తున్నా ఊరేగింపులు, వేడుకలకు డీజే సౌండ్ సిస్టం వాడుతున్నారని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు మాదాసు భానుప్రసాద్, డా. కృష్ణప్రసాద్, ఎం.వెంకటరావు, అందెలశౌరి, విన్సెంట్‌పాల్, తన్నీరు వీరయ్య, రమేష్, లక్ష్మణ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అమ్మవారికి బోనాలు

వినుకొండ జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిమ్మల బావి బజారులోని ఎల్లమ్మ తల్లికి, మార్కాపురం రోడ్డులోని పశువులేరు బిడ్డి వద్ద ఉన్న గంగమ్మ తల్లికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. రాష్ట్రంలో సంవృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కులు తీర్చుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రజక సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి 16 రోజుల పండుగ

వినుకొండ జూలై 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న అతి పురాతమైన లక్ష్మీనరసింహస్వామి 16రోజుల పండుగ కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి వసంతోత్సవం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు పొంగళ్లు నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది సైదారావు, ఎలవర్తి శ్రీనివాసరావు, జీవీ రమణ, జాజుల మాల్యాద్రి, ఏటుకూరి కృష్ణవేణి, పిడతల రమా, నరసింహరావు, రామారావు, భక్త బృందాలు పాల్గొన్నారు.

గుమ్మడి కళాపీఠం కృషి అభినందనీయం

● కౌన్సిలర్ షకీలా బేగం

వినుకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళాకారులకోసం గుమ్మడి కళాపీఠం చేస్తున్న కృషిని కౌన్సిలర్ షకీలా బేగం అభినందించారు. వినుకొండ వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో నియోజ వర్గస్థాయి కళాకారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్ షకీలా బేగం పాల్గొని ప్రజలు కళాకారుల కళను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో రాయపాటి వీరయ్య, కంచర్ల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రావిపాటి వీరయ్య, యోహాన్, పారెళ్ళ ప్రసాద్, చీమకుర్తి హనుమంతరావు, గుమ్మడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీలో ఇద్దరికి పదవులు

చిలకలూరిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరికీ బీజేపీ జిల్లా కమిటీలో పదవులు లభించాయి. బీజేపీ జిల్లా శాఖ ఉపాధ్యక్షుడిగా మల్లెల శివ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శిగా గట్టా హేమ కుమార్ నియమితులయ్యారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శారదా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం చిలకలూరిపేట రోటరీ క్లబ్ సభ్యులు మామిడి, కొబ్బరి మొక్కలు నాటారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు కాపు వెంకట్రావు ఆధ్వర్యంలో వారి కుమారుడు ఎన్నారై కాపు రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు తోటకూర వెంకటనారాయణ, కొల్లా సాంబయ్య, గల్లా సాంబశివరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కోటప్పకొండలోని ధనమ్మ అన్నదాన సత్రంలో నిత్యావసరాలు, దుప్పట్లు, మందులు పంపిణీ చేశారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కంటెయినర్ లారీ

రొంపిచర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో కంటెయినర్ లారీ ఆదివారం పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. హైదరాబాద్ వైపు నుంచి మద్రాసు వైపు వెళ్తున్న కంటెయినర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల పొలాల్లోకి దూసుకువెళ్ళింది. ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రొక్లైనర్ సాయంతో లారీని బయటకు తీశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

నరసరావుపేట లీగల్, జూలై 20, (ఆంధ్రజ్యోతి), పట్టణంలోని నవోదయ నగర్‌కు చెందిన పాత నరసమ్మ అనే 61సంవత్సరాల వృద్ధురాలిని ఓ మోటార్ సైకిల్ ఢీకొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొదటి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం పట్టణంలోని పావులూరి సుబ్బారావు పాఠశాల వద్ద రోడ్డు దాటుతున్న నరసమ్మను ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆమె కాళ్లకు గాయాలయ్యాయి. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ

చిలకలూరిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికాస్ స్కూలులో కాలిగ్రాఫిస్ట్ వె.మల్లికార్జునరావు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రెండు రోజులపాటు కర్సివ్ హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల మౌలిక నైపుణ్యాలను పెంపొందించడం కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు స్కూలు డైరెక్టర్లు దండా పవన్ కుమార్, రోజశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కల్పన, శ్యాంబాబు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువలు

● చివర భూముల రైతుల్లో ఆందోళన
● పూడిక తీయించాలని వినతులు



పెరుమాళ్ళపల్లి మేజర్ కాలువలో కొచ్చెర్ల వద్ద పిచ్చిచెట్లు, మేజర్ కాలువ నుంచి మైనర్ కాలువకు వెళ్ళే సైఫన్ చుట్టూ అల్లుకుపోయిన కంపచెట్లు, అధ్వానంగా ఉన్న ఉప్పరపాలెం మైనర్ కాలువ

ఈపూరు, జులై 20 (ఆంధ్రజ్యోతి): అల్లుకుపోయిన కంప చెట్లు.. పేరుకు పోయిన పూడిక వెరసి చివర భూములకు చేరని సాగునీరు.. ఇదీ మండలంలోని మేజర్, మైనర్ కాలువల పరిస్థితి. పెరుమాళ్లపల్లి మేజర్ కాలువలో కంపచెట్లు అల్లుకుపోయి, పూడిక పేరుకుపోవడంతో దిగువ భూములకు సాగునీరు అందక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కాలువ ఇరువైపులా ఉన్న సిమెంట్ లైనింగ్ పగిలిపోవడంతో కట్టలు బలహీనపడి నీటి ఉధృతికి కోతకు గురయ్యే పరిస్థితి ఉంది. మేజర్ కాలువల పరిధిలోని మైనర్, సబ్‌మైనర్‌ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పెరుమాళ్ళపల్లి మేజర్ నుంచి ఉప్పరపాలెం మైనర్‌కు సాగునీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన డ్రాప్‌లు పగిలిపోయి సైఫన్ కంపచెట్లతో అల్లుకు పోయాయి. దాంతో దిగువకు నీరు సక్రమంగా ప్రవహించడంలేదు. కొన్ని మైనర్ కాలువలల్లో నీరు ప్రవహించడం లేదు. దాంతో మైనర్‌ల కింద భూములకు సాగునీరు చేరడంలేదు. పెరుమాళ్ళపల్లి మేజర్ పరిధిలోని మైనర్ కాలువల కింద సుమారు వెయ్యి ఎకరాలు మాగాణి, మెట్ట భూములు ఉన్నాయి. మేజర్, మైనర్ కాలువలు అధ్వానంగా ఉండడంతో దిగువ భూముల రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువలలో అల్లుకుపోయిన కంపచెట్లు తొలగించి, పూడిక తీయించి దిగువభూములకు సాగునీరు చేరేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుచున్నారు.

ప్రణాళికలు పంపాం:

నెల్లూరి శాంతారావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు

మేజర్, మైనర్ కాలువలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. దిగువ భూములకు సాగునీరు అందేలా కృషి చేస్తాం.

జోరువానలోనూ సుపరిపాలనలో తొలి అడుగు



జోరువానలో బొందిలిపాలెంలో పర్యటిస్తున్న చీఫ్‌విప్ జీవీ

బొందిలిపాలెం (శావల్యాపురం) జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమిప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శావల్యాపురం మండలం బొందిలిపాలెంలో ఆదివారం నిర్వహించారు. జోరువానలోనే జీవీ గ్రామంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను ప్రజలకు వివరించి సమస్యలు తెలుసుకొన్నారు. వివిధ గ్రామాల నుండి కూటమినాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జీవీకి బ్రహ్మరథం పట్టారు. జీవీ మాట్లాడుతూ ఏడాది పాలనలో 83శాతం హామీలు పూర్తిచేసి కూటమిప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాధం, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమతరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాపసాని హనుమంతరావు, మాజీ గ్రామపార్టీ అధ్యక్షులు సోమేపల్లి వెంకట్రావు, పొనుగోటి వెంకట్రావు, గ్రామనాయకులు జెళ్ళెళ్ళ బాలాజీసింగ్, చల్లగుండ్ల రాజశేఖర్, చింతా వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ పట్టణ కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో టీడీపీ పట్టణ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గుంటూరు రోడ్డులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్, శివుడి బొమ్మ సెంటర్ మీదుగా జమీందారు ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పట్టణ కమిటీ శివుడి బొమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీలో వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేశారు. జమీందార్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గూడూరి శేఖర్, కార్యవర్గ సభ్యుడిగా కుంచాల బాజీ, అత్తులూరి సీతయ్య, గురుజాల నాగేశ్వరరావు, మంగళగిరి ఆనంద్, షేక్ అల్లాభక్షు, సానే శ్రీనివాసరావు, మేడికొండ కనకయ్య, మోతే రమేష్‌బాబు, షేక్ బుడే, మంద కోటయ్య, పోక జయమ్మ, నేలటూరి పద్మ, రాఘవమ్మలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండటం వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి ప్రజలు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మీరావలి, వనమా శివ, చంద్రా ఆంజనేయులు, దాసరి ఉదయశ్రీ, కొల్లి బ్రహ్మయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్సూర్ షరీఫ్, పల్లెల నాగిరెడ్డి, అత్తులూరి సుబ్బరావు, కాసా ఆంజనేయులు, షేక్ వలి, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, మార్కెట్‌యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి రవీంద్ర, రాయల శ్రీనివాసరావు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్షపు నీటితో నిండిపోయిన పాఠశాల ఆవరణ

నీట మునిగిన పాఠశాల ప్రాంగణం

నరసరావుపేట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన వర్షానికి నరసరావుపేట మండలం అచ్చమ్మపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాంగణం నీటితో మునిగిపోయింది. పాఠశాలకి వెళ్ళేటపుడు పిల్లలు ఎక్కడ జారి పడతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో గత కొన్నేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రొంపిచర్లలో భారీ వర్షం

రొంపిచర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం భారీవర్షం కురిసింది. దీంతో ప్రధానవీధులు జలమయమయ్యాయి. పొలాలు చదును అయ్యాయని రైతులు పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో జన సంచారం నిలిచిపోయింది.

ఐనవోలు సచివాలయంలో తాత్కాలిక పీహెచ్‌సీ ఏర్పాటు

నూజెండ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మండలంలోని ఐనవోలులో రెండో పీహెచ్‌సీ ఏర్పాటుకు నాయకులు, అధికారులు చొరవ చూపారు. సోమవారం ఐనవోలు సచివాలయంలో పీహెచ్‌సీ నూతన భవనాలు నిర్మాణమయ్యే వరకు తాత్కాలికంగా ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించనున్నారు. సీతారాంపురం సమీపంలో మండలంలో రెండో పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించి ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు, అగ్రిమెంట్ చేసుకోక పనులు ప్రారంభించకపోవటంతో అనేక పర్యాయాలు వాయిదా పడ్డాయి. రెండో పీహెచ్‌సీకి వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించి గత సంవత్సర కాలంగా ఇతర వైద్యశాలలో వైద్య సేవలందిస్తున్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



సందెపూడిలో నిర్మించిన సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తులు, భూములు, ప్రాణాలు పోతాయన్న అభద్రతా భావం నుంచి ప్రజలందరూ బయట పడి సంతోషంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా యడ్లపాడు మండలం సందెపూడి, జాలాది గ్రామాలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఓ వైపు జోరున వర్షం కురుస్తున్నా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. జాలాదిలో రూ.40లక్షల వ్యయంతో వేసిన మెటల్ రోడ్డు, సందెపూడిలో రూ.13లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ మహిళల సంతోషానికే ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. బటన్ నొక్కుడు ముసుగులో జగన్ అన్నివర్గాల ప్రజల్ని మోసగించాడని ప్రత్తిపాటి విమర్శించారు. వైసీపీకి మద్దతు ఇవ్వని వారందరినీ గత పాలకులు వేధించారని, ఆఖరికి ప్రజల ఆస్తులు, భూములు కూడా కాజేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నదన్నారు. నియోజకవర్గానికి ఏడాదిలో అభివృద్ధి పథకాలకు రూ.వెయ్యి కోట్లు అందాయన్నారు.

● నాదెండ్ల: రైతులకు సహకార సంఘాల ద్వారా సకాలంలో రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. గణపవరం సహకార సంఘ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పి.శేషయ్య ఆదివారం ఎమ్మెల్యే పుల్లారావును కలిశారు. ఈ సందర్భంగా శేషయ్యను సత్కరించారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని రాచుమల్లునగర్ వాసులు వార్డు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆదివారం కలిసి కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి త్వరలోనే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

● పిన్నెల్లి సోదరుల ఫ్యాక్షన్ రాజకీయాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి నంబూరి శేషగిరిరావు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శేషగిరిరావు మరణవార్త ఆవేదనకు గురిచేసిందని, టీడీపీ ఒక నిబద్ధత కలిగిన, నిజాయతీపరుడైన నాయకుడిని కోల్పోయిందని సంతాపం ప్రకటించారు.

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఎస్‌టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూలై 2023 నుంచి అమలు చేయవలసిన 12వ సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని ఎస్‌టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని ఎస్‌టీయూ భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి అధ్యక్షతన ఎస్‌టీయూ పల్నాడు జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. పెండింగ్‌లు ఉన్న కరువుభత్యం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యోగా, మెగా పీటీఎం, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో బోధనేతర కార్యక్రమాలు చేపట్టడం వలన పాఠశాలలో బోధనా కార్యక్రమాలు కుంటుపడుతున్నాయన్నారు. విద్యాశక్తి పేరుతో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం భావ్యం కాదన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే గంగాధర్‌బాబు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యు చంద్రజిత్ యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఈ ఏమండి, గేరా మోహనరావు, కరిముల్లా, యేసయ్య, మహబూబ్ సుభాని, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ జె వెంకటేశ్వర్లు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, అమ్మవారికి సారె తీసుకువస్తున్న ఆర్యవైశ్య ఆడపడుచులు

వాసవి కన్యకాపరమేశ్వరికి సారె

ఈపూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆర్యవైశ్య ఆడపడుచులు సారె, పసుపు, కుంకమ సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం చేశారు.



పురస్కారం అందుకుంటున్న సీఐ రమేష్, కంప్యూటర్ ఆపరేటర్లు బాలస్వామి, సుబ్బారావులు

చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్‌కు పురస్కారం

చిలకలూరిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కాలంలో కేసుల దర్యాప్తు, సమాచార వ్యవస్థ బలోపేతం, అవగాహన కార్యక్రమాలు, బందోబస్తు విధుల నిర్వహణలో ఉత్తమ రీతిలో సేవలందించి పల్నాడు జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచిన చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నుంచి పురస్కారం అందుకున్నారు. సీఐతో పాటు స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్లు బాలస్వామి, సుబ్బారావులు కూడా పురస్కారం అందుకున్నారు. నిర్దేశించిన సేవలను ఆన్‌లైన్ చేసి, పారదర్శకంగా సేవలను ప్రజలకు అందుబాటులో తేవడంలో సఫలీకృతులయ్యారని ఉన్నతాధికారులు వారిని ప్రశంసించారు.

సొసైటీ చైర్మన్‌గా విశ్వనాథం బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం సొసైటీ చైర్మన్‌గా గడిపూడి విశ్వనాథం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా గోనుగుంట్ల నాగరాజు, బండారి వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. కూటమి నాయకులు భారీగా తరలివచ్చి వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, ఈపూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గోరింట్ల సత్యనారాయణ, డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, వినుకొండ జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, సీజీబీ మేనేజర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నేను నా తరం' పుస్తకావిష్కరణ

నరసరావుపేట కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆంగ్లోపన్యాసకులు, అనువాదకులు లంకా సత్యనారాయణ రచించిన నేను నాతరం పుస్తకాన్ని ఆదివారం ఇస్సపాలెం శ్రీవాసవి అన్నదాన సత్రంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి శ్రీనాథ సాహితీపీఠం కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి అధ్యక్షత వహించారు. స్వామి విద్యాసంస్థల చైర్మన్ ఈ.ఎం.స్వామి పుస్తకాన్ని సమీక్షించారు. పొన్నపాటి ఈశ్వరరెడ్డి రచయితతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి సత్యనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం పుస్తకాన్ని ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్, వాసవి అన్నదాన సత్రం కన్వీనర్ బత్తుల మురళి, గంధం యాజ్ఞవల్క్యశర్మ, మేళ్లచెర్వు ఆంజనేయులు, కేవీకే రామారావు, గణిత అధ్యాపకులు జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ మూర్తి, పీవీఎస్‌ఆర్ ప్రసాదరావు, వై.త్యాగరాజు, జల్లి శ్రీనివాసరావు, చేగు వెంకటేశ్వరరావు, షేక్ బాజీ మస్తాన్, కే.ఎం.ఎల్ ప్రసాద్, షేక్ రసూల్, ధనలక్ష్మి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.4లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునః నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నరసరావుపేటకు చెందిన మద్దూరి వెంకటేశ్వర రెడ్డి, పార్వతిల కుమార్తె అల్లుడు వజ్రాల కాంతికిరణ్, వెంకాయమ్మ, వారి కుమార్తెలు ఇషికారెడ్డి మహిరా కిరణ్‌రెడ్డి (యూఎస్‌ఏ) ఇస్సపాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం కోసం నాలుగు లక్షల రూపాయల చెక్కుని ఆలయ కార్యనిర్వాహక అధికారి నలబోతు మాధవీదేవికి అందచేశారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.